క్లుప్తంగా

నేడు రోడ్డు విస్తరణ పనులకు మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన

నేరేడుచర్ల : మండలంలో చిల్లెపల్లి నుంచి సోమారం వరకు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ వినియోగదారులకు నేడు ప్రత్యేక కోర్టు

చిలుకూరు : కోదాడ పట్టణంలోని కోదాడ విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో చిలుకూరు మండల ఏఈ సైదయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు, కరెంట్, తదితర సమస్యలపై ఈ కోర్టులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ప్రత్యేక కోర్టు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నడిగూడెం : నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ యాతాకుల జ్యోతి, ఎంపీడీఓ ఇమామ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

మునగాలలో..

మునగాల : మునగాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ మూడు నెలల నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామికి ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం అందజేత



గాయపడిన శ్రీనుకు ఆర్థికసాయం అందజేస్తున్న దొంతగాని అప్పారావు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని కాపుగల్లుకు చెందిన దాచేపల్లి శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం కాపుగల్లు గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ దొంతగాని అప్పారావు.. శ్రీనును పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి తనవంతుగా సహాయసహకారాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు.

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి

నేరేడుచర్ల : నీట్‌లో అవకతవకలపై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో అఖిల పక్ష బృందాలతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనల మేరకు నీట్ పరీక్ష నిర్వహించాలన్నారు. నీట్‌లో అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు వెంకట్ ఉన్నారు.

బేతవోలు రోడ్డుకు మోక్షం

- డబుల్ లేన్‌గా మార్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రూ.16 కోట్ల నిధులు మంజూరు
- నేడు పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



త్వరలో డబుల్ లేన్‌గా మారనున్న బేతవోలు రోడ్డు

చిలుకూరు : మండలంలో బేతవోలు రోడ్డుకు మోక్షం లభించింది. చిలుకూరు మండల కేంద్రంలోని (బేతవోలు క్రాస్ రోడ్డు) జడ్చర్ల జాతీయ రహదారి నుంచి జెర్రిపోతులగూడెం వరకు 10 కిలోమీటర్లు సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్ రోడ్డుగా మారనుంది. డబుల్ రోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు చేసినా ప్రభుత్వ నుంచి నిధులు మాత్రం మంజూరు కాలేదు. నేడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకుని బేతవోలు రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.16 కోట్ల నిధులు మంజూరు చేయించారు. బుధవారం మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలు చేతుల మీదుగా రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనుంది. దీంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పనున్న ఇబ్బందులు..

బేతవోలు రోడ్డు ప్రస్తుతం నిత్యం రద్దీగా ఉంటుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగి పక్కకు పోవడం చాలా కష్టంగా ఉంది. బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, పోలేనిగూడెం, కొండాపురం, మాధవగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణం చేస్తుంటున్నారు. ఈ ప్రాంతంలో వరి సాగు ఎక్కువగా ఉండడంతో లారీలు, వివిధ రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఇక ప్రస్తుతం ఈ దారి డబుల్ రోడ్డుగా మారనుండడంతో వాహనదారులు, రైతులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

33 ఫీట్ల వెడల్పు..

బేతవోలు రోడ్డు 7 మీటర్ల (33 ఫీట్లు) వెడల్పు బీటీగా మారనుంది. రోడ్డుకు ఇరుపక్కల 3 మీటర్లు మట్టి రోడ్డు ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు సింగిల్ లేన్ (10 ఫీట్లు) ఉంది. ఇరు పక్కల ఆక్రమణకు గురైంది. ప్రస్తుతం డబుల్ లేన్ కోసం భూసేకరణ చేయాల్సిన పని లేదు. డబుల్ లేన్‌గా మార్చేందుకు సరిపడా భూమి ఉంది. కనుక పనులు త్వరితగతిన పూర్తికానున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ లేన్ రోడ్డును పూర్తిగా తీసేసి డబుల్ లేన్‌కు మెటల్ వేసి బీటీ రోడ్డుగా మార్చనున్నారు.

పనులు వెంటనే ప్రారంభిస్తాం



బేతవోలు రోడ్డు డబుల్ లేన్‌గా మార్చేందుకు రూ.16 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం పనులకు శంకుస్థాపన చేయనున్నాం. పనులు కూడా త్వరితగతిన ప్రారంభించేలా చూస్తాం.

– ఎన్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే, కోదాడ

ఆలయ భూముల కౌలు వేలం

- కౌలు డబ్బుల వివరాలు తెలపాలని అధికారులను ప్రశ్నించిన రైతులు



అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

చిలుకూరు : పాత చిలుకూరులోని శ్రీకోదండరామస్వామి దేవాలయ భూములు 30 ఎకరాలకు మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో కౌలు వేలం పాట నిర్వహించారు. చిలుకూరు, ఆర్లెగూడెం పరిధిలో నాలుగు ప్రాంతాల్లో ఉన్న భూమిని రెండు సంవత్సరాలకు గాను (నాలుగు సీజన్లు) కౌలు వేలం బహిరంగ పాట నిర్వహించగా 20 మంది రైతులు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. పాటలో రైతులు కాసాని రామస్వామి, బొంత శివాజీ, మండవ వెంకటేశ్వర్లు, ఆరె.రామారావు సంవత్సరానికి మొత్తం 7 లక్షల 15 వేలకు దక్కించుకున్నారు. ఇదే మొత్తాన్ని రెండో ఏడాది కూడా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా, వేలం పాటకు గతంలో కౌలు డబ్బుల వివరాలు తెలియజేయాలని రైతులు అధికారులకు ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ హుజూర్‌నగర్ కార్యనిర్వాహక అధికారి కొండారెడ్డి, ఈఓ మృత్యుంజయశాస్త్రి, ఆలయ పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం



రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు

కోదాడరూరల్ : రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఐదుగురు రైతులకు గొర్రెలు, డైరీ ఫామ్‌లకు మంజూరైన రూ.20 లక్షలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పంట, బంగారు రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ హుస్సేన్, లబ్ధిదారులు గుగులోతు చంద్య, విజయ, చిలకమ్మ, సంఘం సభ్యులు బ్రహ్మం, వెంకటేశ్వరరావు, కొండయ్య, వెంకటేశ్వర్లుఉన్నారు.

26 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997 – 98 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 26 ఏళ్ల తరువాత ఒకే చోట కలుసుకున్న స్నేహితులు ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ ఉపేందర్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, జగన్, నరసింహారావు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కవాతును జయప్రదం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : వరంగల్‌లో జూలై 7న నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఆత్మకూరు మండలానికి చెందిన ములకలపల్లి రవి నియమించారు. ఈ సందర్భంగా రవిని పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కనుకుంట్ల వెంకన్న, రాజు, వెంకన్న, నవీన్, మేడి కృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని పాఠశాలల బస్సులు సీజ్ చేయాలి

మిర్యాలగూడ : ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం, మాలమహానాడు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మిర్యాలగూడలో ఎంఈఓ వీరస్వామికి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్నెస్ లేకుండా నిర్లక్ష్యంగా బస్సులను నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాలమహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవి, నాయకులు బట్టు శ్రీకాంత్, మహమ్మద్ గౌస్, నాగరాజు, సురేష్, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మోతె : సమసమాజ స్థాపనే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మంగళవారం మోతె మండల పరిధిలోని బుర్కచర్ల గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ, పీడిత, వివక్షత, అనిచివేత ఉన్నంత కాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందన్నారు. దేశ భవిష్యత్‌ను మార్చేది సోషలిజమే అని అన్నారు. పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కేవలం కమ్యూనిస్టులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, కాంపాటి శ్రీను, కొక్కిరేణి సత్యనారాయణ, కొండ రాములు, బూడిద లింగయ్య, వెలుగు మధు, జంపాల స్వరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ అందజేస్తున్న హెచ్ఎం, దాతలు

గరిడేపల్లి : మండల పరిధిలోని పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పత్తిపాటి ప్రణీత జయంతి సందర్భంగా తల్లిదండ్రులు పత్తిపాటి జనార్దన్– సరితలు మంగళవారం నోట్‌బుక్స్, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సైదానాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీపై అవగాహన

అర్వపల్లి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న జరిగే మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎల్.చరణ్ కోరారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపల్ ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ విద్యార్హతలతో పాటు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులైన అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లను ఈనెల 21న పాఠశాలలో అందజేయాలని, ఈనెల 22న ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

సత్యనారాయణ మృతి తీరని లోటు



గరిడేపల్లి : సత్యనారాయణ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గరిడేపల్లి : పొనుగోడు మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు బిల్లా సత్యనారాయణ మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, నల్లగొండ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మంగళవారం పొనుగోడులో బిల్లా సత్యనారాయణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రజా నాయకులు సుందరి జగన్, టీడీపీ మండల అధ్యక్షుడు కీసరి నాగయ్య, బిల్లా వెంకటేశ్వర్లు, సోమయ్య, మండల అధికార ప్రతినిధి బాల్తు భాస్కర్, నాయకులు మాచర్ల రవి, కీసరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు నివాళి

బిల్లా సత్యనారాయణ మృతదేహాన్ని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆషారమేష్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల వెంకటేశ్వర్లు, రాంబాబు, కటికం గోపయ్య, సైదులు, మనోజ్, వెంకన్న, గురుస్వామి, అశోక్, వీరబాబు, శేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న దాతలు, భక్తులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు గురుస్వామి, అరుణ, సుజన్‌కుమార్, ఉపేందర్‌రావు, కృష్ణవేణిలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నెలవారి దాతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తి

హుజూర్‌నగర్ : లారీ డ్రైవర్ల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీయడంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో జరిగింది. వివరాలు.. హుజూర్‌నగర్ పట్టణ శివారులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్లు కార్తి, అలిగేషన్ లారీలు ఆపి క్యాబిన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం ముదరడంతో ఘర్షణకు దారి తీసింది. ఇంతలో కార్తి గాయంతో క్యాబిన్‌లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై ఎస్ఐ ముత్తయ్యను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉపేందర్‌కు నివాళి



ఉపేందర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మోతె : మంద ఉపేందర్ మృతి భవన నిర్మాణ కార్మికులకు తీరని లోటని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఒగ్గు సైదులు అన్నారు. సోమవారం రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు ఉపేందర్ మృతి చెందాడు. మంగళవారం తుమ్మలపల్లి గ్రామంలో మంద ఉపేందర్ మృతదేహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గుట్ట శ్రీను, కంకణాల అంజి, నార్ల రంగయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తాం

మిర్యాలగూడ టౌన్ : గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తామని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రయాణికులు పలు సమస్యలు డీఎం దృష్టికి తీసుకొచ్చారు. డీఎం ప్రయాణికులకు సమాధానాలు ఇచ్చారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమాచార హక్కు సలహా, సహాయ, రక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త సరికొండ రుషికేశ్వర్‌రాజు మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో సామాజిక కార్యకర్తలు కొండలు, మహేష్, సైదానాయక్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో సర్కారు బడులు

- పెచ్చులూడుతున్న భవనాలు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- పలుచోట్ల చెట్ల కిందే పాఠాలు



మునగాలలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

మునగాల : మండలంలోని 22 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 27 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సగానికి పైగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన పాఠశాలల భవనాలు 50 శాతానికి పైగా పాతబడి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని పాఠశాలల భవనాల స్లాబ్ పైపెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇక కొన్ని పాఠశాలల్లో చెట్ల కిందే విద్యార్థులకు చదువు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే కొన్ని పాఠశాలలు కురుస్తున్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. అటు పాలకులు, ఇటు సంబంధిత శాఖ అధికార యంత్రాంగం ఈ పాఠశాలలపై దృష్టి సారించకపోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు యుద్ధ ప్రాతిపదికన శిథిలావస్థకు చేరిన భవనాలను కూలగొట్టి, నూతన భవనాలు నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.



స్లాబ్ పెచ్చులూడుతున్న తిమ్మారెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల భవనం



కృష్ణానగర్‌లోని ప్రాథమిక పాఠశాల ఇలా..



శిథిలావస్థలో ఆకుపాములలోని పురాతన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

పాఠశాలకు వెళ్లాలంటేనే భయంగా ఉంది



మా పాఠశాల పాతబడిపోయింది. ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉంది. దీంతో పాఠశాలకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. మా పాఠశాలను కూల్చివేసి కొత్త భవనం నిర్మించాలి.

– బి.సాయికృష్ణ, ఐదవ తరగతి, మునగాల

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



మండలంలో కొన్ని పాఠశాలలకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తా. పూర్తిగా శిథిలావస్థకు చేరిన పాఠశాలలను కూల్చివేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

– ఎండీ.సలీమ్ షరీఫ్, మండల విద్యాధికారి, మునగాల